క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో మిగులు సీట్లు భర్తీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, వెల్డర్, కోపా(కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్), డ్రెస్ మేకింగ్ ట్రేడ్‌లలో సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లను జూలై 22వ తేదీలోగా సమీపంలోని ఏదైనా ఐటీఐ వద్దకు వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులకు మాత్రమే జూలై 24వ తేదీన నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9491134464, 6304086821ను సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అరెస్ట్

సీతంపేట: మండలంలోని జి.గుమ్మడలో సారా విక్రయిస్తున్న ఆరిక శివకుమార్ అనే వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు దోనుబాయి ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సారా విక్రయించినా, తయారు చేసినా చర్యలు తప్పవన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన మారుతీరావు

గరుగుబిల్లి: మండల రీసర్వే ఉప తహసీల్దారుగా ఎస్.మారుతీరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాలకొండ మండలంలో విధులు నిర్వహిస్తుండగా ఇన్‌చార్జ్‌గా ఈ మండలానికి నియమించారు. రీసర్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రతి రైతు సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని ఆయన అన్నారు.

ఎరుకుల కులస్తులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి


కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఎరుకుల కులస్తులు

పార్వతీపురంటౌన్: ఎరుకుల కులస్తులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎరుకుల కులస్తులతో కలసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జియ్యమ్మవలస మండలంలోని తురకనాయుడువలసలో 30 ఏళ్లుగా ఎస్టీ ఎరుకుల కులస్తులు ఉన్నారని కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. గత ఆరునెలలుగా వీఆర్‌ఓ చుట్టూ తిరుగుతున్నా మంజూరు చేయడం లేదన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజేశ్వరి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహించండి

పార్వతీపురం టౌన్: ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలను నిర్వహించాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యకమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తో ఐటీడీఏ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు నాలుగేళ్లుగా ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలు నిర్వహించలేదని, ఈ క్రమంలో గిరిజనుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే పరిస్థితి లేదన్నారు. గిరి వెలుగుపై వస్తున్న ఆరోపణల పట్ల సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపుతున్న ఆదివాసీ జేఏసీ సభ్యులు

పార్వతీపురంటౌన్: షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదివాసీ జేఏసీ జిల్లా వైస్‌చైర్మన్ ఇంటికుప్పల రామకృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేసి జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీలో ప్రకటించిన ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను స్థానిక ఎస్టీ అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంతాల ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని కోరారు. షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, ఆరిక చంద్రశేఖర్, తిరుపతి, ఆదివాసీ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలన అంతా మోసమే..

- సూపర్ సిక్స్ కాదు.. డకౌట్ అయ్యారు..
- ఎంపీ తనూజారాణి
- ప్రభుత్వానికి ప్రజా సమస్యలు పట్టవు : మాజీ ఎమ్మెల్యే కళావతి


క్యూఆర్ కోడ్ కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంపీ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే కళావతి తదితరులు

సీతంపేట:

తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఏడాది పాలనలో హామీలు అమలు చేయలేక డకౌట్ అయ్యారని అరకు ఎంపీ తనూజారాణి ఆరోపించారు. సోమవారం స్థానిక సామాజిక భవనంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ సమావేశాన్ని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు కాకుండా అన్యాయాలకు, అక్రమాలకు తొలి అడుగు అనే కార్యక్రమం నిర్వహించాల్సిందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేకుండా కేవలం ప్రచారం మాత్రం చేసుకుంటున్నారన్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చి, గడప గడపకూ వెళ్లి చెప్పుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఒక్క పని చేయకపోయినా ఎంతో చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు. ఈ క్రమంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు మోసాలు వివరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు తీసుకెళ్లి అందించగా.. నేడు కిలోమీటర్ల కొద్దీ నడిచి సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం కావాలనే రద్దు చేసిందని చెప్పారు. షెడ్యూల్ ఏరియాలో జీఓ 3ని పునరుద్ధరించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం వచ్చినపుడల్లా జీఓ 3ను ప్రస్తావిస్తున్నట్లు చెప్పారు.

– పట్టించుకోవడం లేదు..

కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు అని చెప్పి ఫొటోలకు ఫోజులిచ్చి కూటమి నాయకులు వెళ్లిపోతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో గడప గడపకూ తిరిగి ఎన్నో సమస్యలను గుర్తించామని, అలాగే ఒక్కో పంచాయతీకి రూ. 20 లక్షలు చొప్పున మంజూరు చేశామని


అనంతగిరి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ తనూజారాణి


అనంతగిరి సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

చెప్పారు. ఇప్పుడు కూటమి నాయకులు తాము ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో కుమ్ములాటలు తప్ప అభివృద్ధి లేదన్నారు. ప్రతి నెలా ఏదో ఒక సంక్షేమ కార్యక్రమాన్ని అమలు చేసి జగన్ మోహన్‌రెడ్డి ప్రజల మనస్సు గెలుచుకుంటే.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేస్తూ కాలం గడుపుతున్నారన్నారు. అనంతరం ఎంపీని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీలు కె.సరస్వతి, ఎం.విజయలక్ష్మి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హెచ్.మోహనరావు, నియోజకవర్గ కన్వీనర్ ఎస్.కాంతారావు, సర్పంచ్‌లు ఎ.కళావతి, హెచ్.ఆదిలక్ష్మి, ఎస్.తిరుపతిరావు, ప్రధాని, ముకుంద, బి.తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్‌రావు, హరిప్రసాద్, ఎస్.మంగయ్య, పార్టీ నాయకులు ఎస్.రాము, సాయికుమార్, ఎస్.కృష్ణ, వెంకి, ఎస్.అబ్బాస్, సోమయ్య, ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టండి..

భామిని: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల సమక్షంలో ఎండగట్టి నిలదీయాలని అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ తనూజారాణి పిలుపునిచ్చారు. మండలంలోని అనంతగిరి వద్ద మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, పార్టీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాదిగా ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని.. అలాంటప్పుడు సుపరిపాలనలో ఒక అడుగు కార్యక్రమం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కార్యకర్తల ఉల్లాసం చూస్తే ఆనందంగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌బాబు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ.. కూటమి నాయకులు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. అనంతరం ఎంపీ తనూజారాణిని మహిళా ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బోడ్డెపల్లి చిన్నమ్మి, ఎంపీటీసీ సభ్యురాలు పాట్నూరు ఉష, సర్పంచ్ బౌరి సౌధామిని, పార్టీ మండల నాయకులు తోట సింహాచలం, గెల్లంకి రమేష్, బోనగడ్డి ధర్మారావు, టింగ అన్నాజీరావు, మజ్జి మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నా పథకం వర్తించలేదు..


మైగాపు చంద్రమ్మ

వీరఘట్టం: మండల కేంద్రలోని కొండవీధికి చెందిన మత్స్యకార మహిళ మైగాపు చంద్రమ్మకు ఇద్దరు పిల్లలున్నారు. చేపలు అమ్ముతూ జీవనం సాగిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈమెకు అమ్మఒడి పథకం ద్వారా నాలుగేళ్లలో రూ.54 వేలు వచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం మాత్రం ఈమెకు వర్తింపజేయలేదు. దీంతో ఆమె సోమవారం స్థానిక సచివాలయానికి వచ్చి అధికారులను నిలదీసింది. గత ప్రభుత్వంలో నాకు అమ్మఒడికి అర్హత ఉంటే ఇప్పుడెందుకు 'తల్లికి వందనం' రాలేదని ప్రశ్నించింది. ఉండడానికి సరైన ఇల్లు కూడా లేని నాలాంటి పేదవారికి పథకం వర్తింపజేయకపోవడం అన్యాయమని వాపోయింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటడంతో పథకం వర్తించలేదని అధికారులు చెప్పారని.. అయితే తన ఇంటిలో ఒక ఫ్యాన్, ఒక బల్బు, టీవీ మాత్రమే ఉన్నాయని తెలిపింది. తనలాగే చాలా మందికి పథకం వర్తించలేదని వాపోయింది.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


తాడు సాయంతో విత్తనాలు వేస్తున్న రైతులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ అసోసియేట్‌లు జి.అన్నపూర్ణ, సీహెచ్ సావిత్రి తెలిపారు. సోమవారం కురుపాం మండలంలోని దురిబిలి గ్రామంలో పలువురు రైతుల పొలాల్లో తాడు సాయంతో వరి, మినుములు, పెసర, గోంగూర, తోటకూర, బెండ విత్తనాలు వేయించి, ఆయా పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఇలా డిబ్బింగ్ మోడల్ ద్వారా విత్తనాలు వేసుకుంటే వర్షం కురిసిన వెంటనే వరి మొలకలు అధికంగా వస్తాయని, పంటకు అవసరమైన పోషకాలు కూడా నేల నుంచి సమృద్ధిగా వస్తాయన్నారు. ప్రకృతి సాగు విధానాలు అనుసరిస్తూ పంటలు పండించుకుంటే పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఎం.ప్రసాద్, దాశరథి, సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవేశాలపై దృష్టి సారించండి

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో1 ఎస్.సింహాచలం సూచించారు.

మండలంలోని సీతారాంపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు సహా రికార్డుల నమోదు, విద్యార్థుల ప్రగతి కార్డులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందివ్వాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. అనంతరం ప్రతి తరగతికి వెళ్లి వివిధ ప్రశ్నలడిగి విద్యార్థుల విద్యాసామర్థ్యాలు అంచనా వేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రహదారిని అభివృద్ధి చేయరూ..


దుగ్గి- నక్కపేట రహదారి దుస్థితి

పాలకొండ రూరల్: మండలంలోని నక్కపేట పారాపురం గ్రామానికి వెళ్లే రహదరి పూర్తిగా రూపు కోల్పోయింది. అసలే మట్టి రోడ్డు. ఆపై ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. పైగా రోడ్డు మొత్తం గోతులతో నిండిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దుగ్గి పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉన్న ఈ ప్రాంతం మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామంలో సుమారు నాలుగు వందల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఇటీవల ఎన్నికలకు ముందు తమ గ్రామానికి వచ్చిన నాయకులు వసతులు కల్పిస్తామని మాట ఇచ్చినా, నెరవేర్చలేకపోయారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి పారిశుధ్య పక్షోత్సవాలు

గరుగుబిల్లి: మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి పారిశుధ్య పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టడం జరుగుతుందని, ప్రతి వీధి, కాలువలు శుభ్రం చేయడంతో పాటు తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మంచినీటి బోర్లు వద్ద పారిశుధ్య లోపం లేకుండా చూడడం జరుగుతుందన్నారు.

19న మండల సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.త్రివిక్రమరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులంతా వస్తున్నారని, మండల స్థాయి అధికారులంతా అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

జలకళ తప్పిన చెరువులు


గరుగుబిల్లిలో అడుగుంటిన నీటితో చెరువు

గరుగుబిల్లి: మండంలోని చెరువుల్లో జలకళ తప్పింది. ఏ గ్రామ చెరువు చూసినా తగినంత నీరు లేదు. దీంతో సాగునీటికి, వాడుకకు, పశువులను కడిగేందుకు నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జూలై రెండో వారం గడుస్తున్నా వర్షాలు అంతగా కురవకపోవడంతో చెరువుల్లో నీటిజాడలు అంతగా లేవు. దీంతో పశుపక్ష్యాదులు దాహం తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్నాయి. మండలంలో మొత్తం 368 చెరువులు ఉండగా, వీటిలో గంగసాగరం, కృష్ణసాగరం తదితర పెద్ద చెరువుల్లో సైతం నీరు లేకపోవడం గమనార్హం. మిగిలిన చిన్నాచితక చెరువుల్లో అసలు నీరుందా లేదా అనే రీతిలో నెలకొన్న పరిస్థితి. వర్షాలు లేని సమయంలో చెరువు నీరే సాగునీటిగా ఉపయోగించే రైతులంతా ఇప్పుడు చెరువులో కూడా నీరు లేకపోవడంతో వానలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

సారా విక్రయిస్తే చర్యలు


నిందితులకు సూచనలు చేస్తున్న మండల మెజిస్ట్రేట్ రాధాకృష్ణమూర్తి

పాలకొండ రూరల్: సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ చల్లా రాధాకృష్ణమూర్తి అన్నారు. పాలకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి నేతృత్వంలో ఆరుగురు నిందితులను తహసీల్దార్ కోర్టులో సోమవారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సారా తయారీ, విక్రయాల వల్ల కలిగే ఇబ్బందులను తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

92 వినతుల స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: ఐటీడీఏలో పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 92 వినతులు స్వీకరించారు. కుంబి గ్రామంలో బోరు వేయాలని గ్రామస్తులు కోరుతూ వినతిపత్రం అందజేశారు. అలాగే భరిణికోట – కొండలోగాం గ్రామాలకు రహదారి నిర్మించాలని భరణికోటకు చెందిన ఉమాశంకర్, తదితరులు వినతిపత్రం ఇచ్చారు. అలాగే కిల్లాడ, సందిమానుగూడ, కన్నయ్యగూడ గ్రామాలకు చెందిన పలువురు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఏఎంఒ కోటిబాబు, ఏపీడీ శ్రీహరి, పీహెచ్‌ఓ వెంకట గణేష్, జీసీసీ మేనేజర్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

బోర్ల మరమ్మతులకు చర్యలు


పాడైన బోరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయ రంగారావు, సిబ్బంది

పాలకొండ: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి బోర్ల మరమ్మత్తులకు చర్యలు తీసుకున్నామని ఎంపీడీఓ విజయరంగారావు అన్నారు. మండలంలోని కొండాపురంలో సోమవారం ఆయన పర్యటించి బోర్ల పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోనూ తాగునీటి వనరులను వినియోగంలోనికి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరమ్మతులకు అవసరమయ్యే మెటీరియల్ సిద్ధంగా ఉంచామన్నారు. ఆయనతో పాటు సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

శివారు భూములకు సాగునీరు అందించండి


జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం: ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు నాగావళి ఎడమ కాలువ ద్వారా మండలంలోని శివారు పంట పొలాలకు సాగునీరు సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు కోరారు. ఈ మేరకు జలవనరుల శాఖ ఏఈ డీవీ రమణతో సోమవారం చర్చించారు. కాలువల పరిస్థితి, నీటి పంపిణీ, లభ్యత, తదితర అంశాలపై సమీక్షించారు.

మున్సిపల్ కార్మికుల నిరసన


మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న కార్మికులు

పాలకొండ: నగర పంచాయతీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది సమ్మెలో భాగంగా రెండో రోజైన సోమవారం మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలంలో చేసిన ఒప్పందాల మేరకు కార్మికులకు న్యాయం చేయాలన్నారు. అంతవరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

దోమల నివారణ మందు పిచికారీ చేసుకోవాలి


నెయ్యిల వీధిలో దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న వైద్యాధికారి శంకరరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రతి ఇంటి వారు దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలని రావాడ రామభద్రాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చీకటి శంకరరావు తెలిపారు. కురుపాం మండల కేంద్రంలోని గౌడు, నెయ్యిల వీధులతో పాటు గాంధీనగర్‌లో చేపట్టిన దోమల నివారణ మందు పిచికారీని ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా నిర్మూలనలో భాగంగా దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా జ్వరం బారిన ప్రజలు పడకుండా దోమల నివారణ మందు ప్రతి ఇంటి వద్ద పిచికారీ చేయించడం జరుగుతోందన్నారు. ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆదిల్, ఈవో కె.సురేష్‌కుమార్, సూపర్‌వైజర్లు కె.రాధాకృష్ణ, రాజశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ యు.ప్రత్యూష, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంచేందుకు ముందుకురావాలి


అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి సురేష్‌కుమార్

గరుగుబిల్లి: పశుగ్రాసం పెంచేందుకు పాడిరైతులు ముందుకురావాలని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి ఎస్.సురేష్‌కుమార్ కోరారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో పశుగ్రాస ముగింపు వారోత్సవాలు సోమవారం జరిగాయి. ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి పశుగ్రాసం చాలా కీలకమన్నారు. మేలుజాతి పశుగ్రాసాన్ని సాగు చేయడం ద్వారా పశువులకు కావాల్సిన పోషకాహారం లభ్యమై పాలలో వెన్నశాతం పెరుగుతుందన్నారు. అలాగే పశువులు ఆరోగ్యంగా కూడా ఉంటాయన్నారు. ప్రభుత్వం పాడిరైతులకు పశుగ్రాస విత్తనాలను రాయితీపై సరఫరా చేయడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తెలుగు జాతి సిగ్గుపడేలా కూటమి పాలన


విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శి

జియ్యమ్మవలస రూరల్: కృష్ణా జిల్లా, గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడడం అమానుషమని వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శి రౌతు విజయ్‌కుమార్ అన్నారు. ఇదే విషయమై ఆయన పెదమేరంగి కూడలిలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి హింసాత్మక పాలన కొనసాగుతోందని, అంతటా కక్షపూరిత రాజకీయాలే జరుగుతున్నాయని విమర్శించారు. కూటమి పాలన చూసి యావత్తు తెలుగు జాతి సిగ్గు పడుతోందన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలిపైనే ఇలా దాడికి ఎగబడితే సామాన్య ప్రజల భద్రత ఏం కావాలని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న అన్యాయం, అక్రమాలపై ప్రశ్నిస్తే కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పారిశుధ్య నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ విజయరంగారావు అన్నారు. కలెక్టర్ సూచనల మేరకు మండలంలో చెత్త సేకరణ కేంద్రాలు అందుబాటులో లేని గ్రామాల్లో సోమవారం క్షేత్ర పరిశీలన చేపట్టారు. నగావళి నదీ తీరానికి ఆనుకుని ఉన్న గోపాలపురం, చిన మంగళాపురం, కొండాపురం, తదితర గ్రామాల్లో తొలివిడత పారిశుధ్య పనులు చేయించాలని ఎంపీడీఓ సూచించారు.